# 2. శృంగారం అందాలంటే...

"ఇదిగో.... నానమ్మా, నానమ్మోయ్"

"అబ్బా! ఎన్నాళ్లకలా పిలిచావే. నా బంగారం! ఇవాళ ఏమిటో విశేషం ఉండే ఉండాలి...."

"ఎందుకలా మాటాడతావ్ నానమ్మా?"

"మాట్లాడనా మరి? ఉద్యోగాలవంక పెట్టుకుని మీ అమ్మ నాన్నా ఆ విదేశాల్లో స్థిరపడిపోయారు. నీకేమో ఇరవై నాలుగ్గంటలూ చదువురంధి. ఇక మీకు నాతో గడిపే తీరుబడి ఎక్కడ! ఇవాళ నీ మటుకు నువ్వు ఇలా వచ్చావంటే మరో శ్రోత దొరకకనేకద!"

"అదిగో, అలా అల్లరిపెడితే నే చెప్పనే చెప్పను"

"ఒకరితో ఒకరం ఎప్పుడో అప్పుడు చెప్పుకోకుండా వుండడానికి ఈ ఇంట్లో మనకింకెవరున్నారే బంగారం! వయసులో ఉన్నతేడా మనమధ్య ఎప్పుడడ్డంగా నిలిచింది గనక! నువ్వు నాతోనూ, నేను నీతోనూ చెప్పుకోవాలని ఎంతగా కొట్టుకుపోతూంటామో నీకు తెలీదా!".

"అందుకే కదా, ఏ చుట్టూ తిరిగినా నా మనసు నీదగ్గరకే కేంద్రీకృతమయేది! నానమ్మా, ఇవాళ ఓ ముఖ్య విషయం నీకు చెప్పదల్చుకున్నాను"

"నువ్వు చెప్పదల్చుకున్నదేదో తెలుస్తూనే ఉంది!"

"అరె, ఎలా పోల్చావ్, నేనేం చెప్పనేలేదు కదా!"

"వేరే చెప్పాలా ఏం? ఎప్పుడూలేంది నీ మాటలో తడబాటు వినిపిస్తోంది. నీ కంటిలో ఏదో కొత్తకళ తొంగి చూస్తోంది. ఇంత దగ్గిరదాన్నయినా చెప్పనా మాననా అనే ఊగిసలాట ధ్వనిస్తోంది" అంది ఆమె.

"సెభాష్ నానమ్మా! ఇంతవయసులోనూ నీ సెన్సెస్ అన్నీ ఎంత పెర్ఫెక్ట్‌గా పనిచేస్తున్నాయ్! ఎంత శ్రద్ధగా వాడుకుని ఎంత స్వచ్ఛంగా ఉంచుకున్నావో! ఇన్ని పోల్చినదానిని వాటికి మూలంకూడా ఏదో చెప్పుకో చూద్దాం!" అన్నది మనుమరాలు.

"ఎందుకు చెప్పలేనూ ప్రేమలో పడుంటావ్, అంతే కద!" అన్నది ముసలామె.

"కరెక్ట్! ఎప్పటికప్పుడు చెబుదామనుకుని, ఏదో సిగ్గూ మొహమాటం ముంచుకొచ్చి, ఇన్నాళ్లూ బయట పడలేకపోయాను. సారీ నానమ్మా!" అంది.

"శారీ బ్లౌజూ మా కాలం మాటలు. ఇప్పుడెంత వయసొచ్చినా, ఏ షేపులోవున్నా మన తెలుగువాళ్ల బట్టలదారి చుడీదారే! అవన్నీ ఎందుకు, విషయం విప్పు".

"అబ్బబ్బ! ఏవేవో బ్రేకులు. ఎన్నెన్నో జోకులు...నీనోట ఒక్కటంటే ఒక్కమాట తిన్నగా రాదుగదా!"

"అలావస్తే నా దగ్గరకి నువ్వెందుకొస్తావే బంగారం. కడుపునపుట్టిన కొడుకే కాసుల గలగలకి

దాసుడై నాకు దూరమైపోయాడు గాని ఆనాడు మీ తాతయ్య ఒకే ఒక పది నిముషాలపాటు నేనెవరితోనో మాట్లాడుతూంటే విని...విని... ఆ క్షణమే నన్నుచేసుకోవాలని పట్టుపట్టి..." అంటూ ఆగిందామె.

"అయ్యో, ఏదో అనబోయి పొరపాటున నిన్నింకోదాన్లో దింపినట్టున్నాను. తాతయ్యని తలుచుకుంటే నువ్వేమైపోతావో నాకు తెలియందికాదు.."

"లేదు..లేదు.. నీకు తెలియంది చాలావుంది.. తాతయ్యని తలుచుకోకుండా నేనెప్పుడూలేను. ఇలా నన్ను మలచిందీ, నీతో ఇప్పుడిలా నన్ను మాట్లాడనిస్తోందీ మీ తాతయ్యే" అన్నదామె.

"అంటే నువ్వు...? అడిగింది మనమరాలు.

"అలా అడ్డురాకు. ముందు నన్ను చెప్పనీ... మన కాళ్లు... ఈ భూమ్మీదే ఉంటాయని తెలిసినా ఎప్పుడూ నవ్వుతూనే ఉండాలనుకొనేవాళ్లు కమ్మని కలల్లోనే తియ్యని ఊహల్లోనే బతకాలి. ఉంటేనేం, పోతేనేం నేనూ మీ తాతయ్యా ఒక్కచోటే ఉంటాం. మబ్బుల్లో పల్టీలు కొట్టే పిట్టనిచూసినా, తన ఎత్తు చేరలేదని తెలిసి ఏ కుక్కనో ఆటపట్టిస్తున్న పిల్లిని చూసినా, మేమిద్దరం ఆనందిస్తున్నట్టు అనిపిస్తుంది నాకు.

ఒక్కొక్కప్పుడు తెలియకుండానే ఒంటరితనమనిపించి దిగాలుపడి కూచుంటాను. మరుక్షణం కన్నీళ్లు తుడుచుకుని కలకలానవ్వేస్తూ ఉంటాను. సరే సరే నీకు శ్రోతని అవుదామనుకుని నిన్నే శ్రోతని చేసేసినట్టున్నాను. చెప్పు చెప్పు..." అంది ఆమె.

"సరే చెబుతాను. ఈ సారైనా ఆనకట్ట కట్టక ఈ ప్రవాహాన్ని సాగనీ" అంది మనుమరాలు.

"సరే! అలాగే చెప్పు మరి"

"నీ ముందు దాచేదేముంది! ఆవలించకుండానే పేగులు లెక్కెట్టగలవు. లవ్ ఎఫైర్ అని ముందే పోల్చేశావ్. పోతే నీకు కొన్ని డీటైల్స్ చెప్పాలి. మదన్ అని ఛార్టెడ్ ఎకౌంటెంట్‌గారి అబ్బాయి నాతోపాటు ఉస్మానియాలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు. బాగాపొడుగ్గా ఉంటాడు. దానికి తగిన ఒళ్లు, మాంఛి తెలుపు. చక్కటి పలువరుస...నొక్కు నొక్కుల జుత్తు పలచటిమీసం... ఓసారి అతన్నిచూస్తే, ఆ చూసింది ఆడదే అయితే, మరి నిద్రపట్టదనుకో!"

"నిద్రపట్టడందాకా ఎందుకే వెర్రిమొహం, నీకేం తక్కువని! నిన్నిలా ఓసారి ఎగాదిగా ఏపోజులో ఏ బట్టతో చూడనియ్యి. కళ్లుగిర్రున తిరిగి ఢామ్మని కింద పడిపోకపోతే వాడు మగాడటే?"

"టకీటకీమని ఏం చక్కగా జవాబు చెబుతావ్ నానమ్మా నువ్వు! ఎప్పుడోగాని వీధి మొహం చూడవు. ఎలా వస్తున్నాయి ఇన్నిన్ని కబుర్లు?"

"తెచ్చిపెట్టుకున్న వ్యధలాంటి టీ.వీ. ఉండనే ఉంది కదా, ఎక్కడెక్కడికంపూ ఇంట్లోనే కొట్టించే కంప్యూటర్ లేని కొంపంటూ సాధారణంగా ఇప్పుడు లేనేలేదుకదా... తెల్లారకుండానే ఎందరి బతుకులు తెల్లారిపోయాయో ఏరోజుకారోజు చేరేసే దినపత్రికలు ఉండనే ఉన్నాయి కదా.. కాస్తంత బుర్రాబుద్ధీ ఉంటే ఎన్నికబుర్లయినా తన్నుకొస్తాయి. ఇంతకీ మీ ప్రేమపురాణం పూర్తిగా విప్పేవు కాదు..." అంటూ

ప్రోత్సహించిందామె.

"ఇదుగో వస్తున్నా...నాకూ మదన్‌కీ చూపులు కలిశాయి కదా అవి క్రమక్రమంగా ప్రేమలేఖలుగా మారేయి... అప్పుడప్పుడు కలుసుకుంటేగాని కుదరదని ఈ మధ్య మరీ మారాం మొదలెట్టాయి"

"సరే ఇదంతా పాతసినిమాకథే...తర్వాత?"

"చెప్పేను కద... కలుసుకుంటున్నామని..."

"కలుసుకుని ఏం చేసేవారని? నాకు వివరాలు కావాలి... చెప్పడానికి వచ్చిన నీకు నా దగ్గిర రహస్యం ఎలా కుదురుతుంది! ప్రతీదీ ముక్క ముక్కా నాకు అప్పగించాలి. చుక్క చుక్కా నేను ఆబగా చప్పరించాలి!"

"చాల్లేబామ్మా, ఇలాంటివి ఎవరు చెప్పగలరు!"

"మరి ఏమంటూ నా దగ్గిరకి పరిగెత్తుకొచ్చావ్?"

"అబ్బ! నీతో ప్రతీదీ గొడవే! వయసుచేసే తొందరకి ఆగలేక మేమేదో తప్పుపనిచేశామని చెప్పాలని నీ ఉద్దేశంకాబోలు! అలాంటి పొరపాట్లేం జరగనివ్వలేదులే... కనుచూపుమేరలో కన్నవాళ్ళు లేకపోయినా నిప్పులాంటి నీలాంటిదాని నీడలో పెరిగినదాన్ని నేను. కోటికి పడగెత్తిన తండ్రికి ఏకైక సంతానం అయినా, పొగవాసన అయినా కిట్టని సంప్రదాయం అతన్ది.. పెళ్ళికి ముందు మామధ్య ఏముంటాయనుకున్నావ్?"

"అంతేనా, అంతకుమించి ఏంలేదా!"

"అదేమిటి నానమ్మా, అంత చిత్రంగా అడుగుతున్నావ్? ఇవాళే మేం ఫైనల్ డెసిషన్‌కి వచ్చాం. ఇప్పుడే ఆ సంగతి ఈమెయిల్‌లో అమ్మకీ నాన్నకీ ఆ శుభవార్త అందజేశాను. వాళ్ళవాళ్ళ కన్వీనియన్సు చూసుకుని ముహూర్తాలు పెట్టుకోవడమే తరువాయి. కేస్ట్‌లోగాని స్టేటస్‌లోగాని ఎలాంటి తేడాలూలేవు. ఇవన్నీ చెవినవేస్తే ఎంతో సంతోషిస్తావనీ, ఏ మినపసున్నో చేసి నా నోట్లో వేస్తావనీ ఎక్స్‌పెక్ట్ చేస్తే ఇంకా ఏంలేదా అని అడుగుతావేమిటి? చల్లగా సంసారం సాగాలనేకదా మీ పెద్దవాళ్ల దీవెన?"

"నిజమే. అలా జరగడానికి మీరు పెట్టిన పెట్టుబడి ఏమిటని?" అని అడిగింది ముసలామె.

"ఏమిటో ఇవాళ నీ వరసంతా చిత్రంగా ఉంది"

"అదేదో తర్వాత చూద్దాంగాని ముందిదిచెప్పు. ఓ ఆర్నెల్లపాటైనా గడిపొచ్చామని చెబుతున్నావ్ ఎక్కడ"

"ఇంకెక్కడ, పబ్లిక్‌పార్క్‌లోనో, టాంక్‌బండ్‌మీదో"

"బావుంది. కూచుని ఏంచేసేవారుట?"

"ఏంచేస్తాం, పార్కులో అయితే పువ్వుల్నిచూస్తూ కూచునేవాళ్లం. టాంక్‌బండ్‌మీద అయితే పక్కనున్న సాగర్‌లో గాలికి అల్లాడే కెరటాల్ని చూసేవాళ్లం"

"అంతగా ప్రేమతో మునిగితేలుతూ ఉంటే ప్రేమించే వ్యక్తి ఆకారంతప్ప మరొకటి కనపడుతుందిటే?"

"అయితే? పెళ్లిపెటాకులూ కాకుండా పబ్లిక్ ప్లేసుల్లో ఒకరిమీదపడి మరొకరు దొర్లమంటావా!"

"పబ్లిగ్గా దొర్లడం ఇష్టంలేకపోతే పోనీ ప్రైవేటుగా పొర్లడానికి ఏవైనా సీక్రెట్ ఏర్పాట్లు చేసుకోవచ్చుగా."

"ఏమ్మాటలు నానమ్మా యివి? నీ వయసులో ఉన్న దాని నోటినుంచి రావలసినవేనా యివి?"

"ఏమో నామటుకునాకు మరోవిధంగా జరిగితేనూ"

"అలాగా! తాతయ్య వాళ్ల పెద్దవాళ్లనందర్నీ ఎదిరించి నిన్ను చేసుకున్నాడన్నంతవరకూ నేనెరుగుదుననుకో.. డీటైల్స్ తెలీదు. నువ్వెప్పుడైనా చెబుతేనా?"

"సమయం రాలేదు గనక చెప్పలేదు. ఇప్పుడెలాగా ఆ మాట వచ్చిందిగనక చెప్పకుండా ఉండలేను. మీలా చూపులతో, లేఖలతో, దూరదూరంగా కూచుని గుటకలు మింగడంతో మొదలవలేదు మా ప్రేమ. ఆ చీకటిగదిలో వెనకనుంచివచ్చి మీ తాతగారు నన్ను వాటేసుకోవడంతోనే చిగురుతొడిగింది మా వలపు. అవెంతపాతరోజులంటే ఆ రోజుల్లోయింకా మన వైపు ఎలక్ట్రీ దీపాలు రాలేదు. ఇంతకీ అసలైన చీకటి బల్బ్ వెలిగించుకుంటే పోయేటంత సాధారణ విషయం కాదు. మూఢాచారాలతో మూఢవిశ్వాసాలతో అలుముకున్న అజ్ఞానమే అసలైన అంధకారం. అప్పటికే పద్దెనిమిదేళ్లు దాటేయి. నాకు ఇంట్లోవాళ్లు చెప్పడంకాదు, నామటుకు నేనే పూర్తిగా నమ్మేశాను, ఏనాడో చేసుకున్న పాపంవల్ల అలా అన్నేళ్లపాటు కన్యగా ఉండిపోయాననీ ఇక జీవితంలో కల్యాణయోగం ఉండదనీ.."

"అదేమిటి నానమ్మా నీ ఒంటిమీదకి ముప్పై వచ్చాయా, నలభై వచ్చాయా, నువ్వెందుకలా అనుకున్నావ్, నీకింకపెళ్లి గీత అనేది లేదని!"

"అప్పటి పరిస్థితులు ఏమాత్రం అవగాహన చేసుకున్నా నువ్విలా అడిగి ఉండవు. ఇప్పటి వివాహ మంత్రంలో కూడా 'అష్టవర్షా భవేత్‌కన్యా' అనే చదివిస్తారు, వినేఉంటావు. అంటే 'మా ఎనిమిదేళ్ల అమ్మాయిని మీకిచ్చి పెళ్లి చేస్తున్నాను' అనే అర్థం.

అంటే ఏమిటి? ఆడపిల్ల పెళ్లివయస్సు, పోనీ ఆ రోజుల్లోనే అనుకుందాం, ఎనిమిదేళ్లనేగా! పైగా పదేళ్లకే వ్యక్తురాల్ని గుర్రంలా ఎదిగిన కుర్రదాన్ని నేను.

రజస్వలానంతర వివాహం మహాపాతకంగా భావించే ఆహితాగ్నుల వంశంలో పుట్టేను నేను. పెద్ద మనిషి అవలేదని బొంకి రెండేళ్ళపాటు నాకు సంబంధం తెద్దామని విఫల ప్రయత్నంచేశాడు మా నాన్న. ఓసారి ఇంటికివస్తూనే తనంత పొడుగు ఎదిగిన నన్ను చూసి చేంతాడుతో ఒళ్లంతా తట్లుతేలేలా బాదడం ఇప్పటికీ నాకు గుర్తుంది. ఇక లాభంలేదనుకుని నన్నలా పక్కకి ఉంచి మా చెల్లికి పెళ్ళిచేసేశారు,. ఓ ఏటికో ఏడు వెనక పడడంతో నా పెళ్లి మాటే వెనక్కి పెట్టేశారు.

మా పెద్దక్క కూతురి పెళ్లిలో ఎవరో అడిగితే 'ఏం చెయ్యమన్నారు, దానియోగం బాగులేదు.

చూసిచూసి కుజదోషం ఉన్నదాన్ని కట్టబెట్టి ఏ వరుడి ప్రాణం తియ్యమన్నారు?' అని కన్నతల్లే మరి తిరుగులేని అబద్ధం చెబితే నన్నే గంగలో దిగమన్నావ్?"

"ఇన్నేళ్లపాటు ఓ చూరుకింద ఉన్నాం. చిన్నప్పుడే ఇలాంటికష్టానికి గురయ్యానని ఎప్పుడూ చెప్పలేదేం!"

"కుజదోషం సంగతి ఎత్తకుండా గుణదోషాల విలువ తెలిసిన మనిషి మీ తాతయ్య రూపంలో నా జీవితంలో ప్రవేశించాక ఇక నాకు కష్టాలంటూ ఏమున్నాయ్? ఎక్కడ విన్నారో ఏంచూశారో నన్ను చేసుకుంటానని మా వాళ్ళనే అడిగారు. ఈ సారి ఎందుకు వద్దన్నారో మా నాన్న ఆ రాత్రి నాకు హితబోధచేశారు.

'చూడు తల్లీ... ఆ రౌడీవెధవ ఏకంగా నీతోనేవచ్చి మంతనాలాడుతున్నాడని విన్నాను. వాళ్లేమో ఆరామద్రావిళ్లు, మనమేమో ప్రథమశాఖ నియోగులం. ఇంతటి శాఖాభేదమున్న సంబంధాలు కలుపుకున్న కులాల వాళ్లంతా కుళ్లికుళ్లిచచ్చారని నీకు శతకోటి తార్కాణాలు చూపించగలను. మేజరుని అయిపోయాను కదా, నీ ఇష్టమనుకునిఆ పోకిరీవెధవ పాలబడ్డావో ఋషుల శాపానికి బలైపోతావు జాగ్రత్త' అని బ్రెయిన్‌వాష్‌చేస్తే అక్షరాలా నమ్మి, అలాగే చేస్తానని చేతిలోచెయ్యికూడా వేశాను"

"ఆ తర్వాత ఏం జరిగిందట?"

"చెబుతున్నానుగా, వినుమరి... మరో పదిహేను రోజులకి, మా వాళ్లంతా ఊరికి పెళ్ళికెళ్లారు., మా మేనత్త వంటింట్లో ఉంది. ఎవరో పిలిచినట్లై వీధిలోకి వచ్చాను. 'వీధిచివర కారు ఆగి ఉంది. మీ నాన్నా వాళ్లూ తిరిగొచ్చినట్టున్నారు. మిమ్మల్ని పిలుస్తున్నారు' అని పనిమనిషి వచ్చి చెప్పింది కాబోలనుకుని వెళ్లేను.

మీ తాతగారే! 'నీతో మాట్లాడాలి. ఏం చెయ్యన్లే. ఓ అరగంట మాట్లాడి వదిలేస్తాను' అంటూ బలవంతాన కారెక్కించారు. దార్లో ఓ చోట ఆపించారు.

అరుగుమీద కూచున్నాం ఎదురెదురుగా... నేనేం వినదల్చుకోలేదు 'నన్నిలా మోసంచెయ్యడం బావులేదు. ఎలా వచ్చిందాన్ని అలా యింటికి దిగబెట్టెయ్యండి' అని ఒకే ఒకమాట తప్ప నానోటరాలేదు. అద్దైనా హడావిడి పడిపోతూ, ఒణికిపోతూ, ఏడుస్తూ...

ఆయనిలా అన్నారు 'మీవాళ్లు నిన్ను ఆరో క్లాసుతో ఆపించేశారు. ఎందుకో తెలుసా, ఇంట్లో కూచోపెట్టి వాళ్ల భావాలే నీవిగా నిన్నూ నాశనం చెయ్యడానికి వీలుగా ఉంటుందనీ.... మూఢనమ్మకాలతో అవుతే ఔగాక నిన్నెందుకు ఇంట్లో కూచోపెట్టారో తెలుసా, ముప్పొద్దులా చాకిరీచేసే ఇల్లు చేరిన విధవాడపడుచు ఆ ఇంట్లో లేదనీ... ఇలా బతికున్నంతకాలం ఏ కోరికాలేకుండా అణగారిపోడం నీకు సాధ్యమే అనుకుంటున్నావా? పోనీ దీనికైనా జవాబుచెప్పు' కొంతవరకూ ఒప్పుకున్నా' శాఖాభేదం మహాపాపమంటారే, దాని మాట?' అని అడక్కుండా ఊరుకోలేకపోయాను.

'ఇంకా శాఖల్ని పట్టుకుని వేళ్లాడే స్థితిలోనే ఉన్నావా నువ్వు! కులపట్టింపే ఎరగరే మనం

పూజించే దేవతలు! రుక్మిణీకల్యాణం చదివించలేదా మీవాళ్లు నీచేత?"

"రుక్మిణి అంటే మహాలక్ష్మి అంశ, సాక్షాత్తూ ఆ కృష్ణపరమాత్మ పట్టమహిషి. ఆవిడ కల్యాణం చదవని వాళ్లెవరుంటారు?"

"మరయితే ఆవిడ అడుగు జాడల్లో ఎందుకు నడవవ్?"

క్షత్రియవంశంలో పుట్టినా యదువంశీయుణ్ణి ప్రేమించింది. పెద్దలు మరో సంబంధం నిశ్చయిస్తే బుద్ధిగా చేసుకోవాలా? పురాణాలమొత్తం మీద ఫస్ట్ లవ్‌లెటర్ రాసినఖ్యాతి రుక్మిణిదే. ఓ మేష్టర్ని బతిమాలి ఆ ఉత్తరం ప్రియుడికి అందేలా చూసుకుంది.

అట్నించే ముందుగా లైన్‌క్లియర్ అయితే ఊరుకోనేటంత అమాయకుడా ఆ రసికశిఖామణి! వెంటనే ప్లాన్ చేశాడు. అదే మాష్టారిచేత కబురంపించాడు.

పెళ్లి ముందు గౌరీపూజ చేయిస్తారుగా... ఆ దేవాలయందగ్గిర రథంతో ఆ వేళకొచ్చి లేపుకుపోతానన్నాడు.

రెండో కంటివాడికి తెలీకుండా అలాగేచేసి బాయ్ ఫ్రెండ్‌తో లేచిచక్కాబోయింది, సాక్షాత్తూ ఆ మహాలక్ష్మీ అవతారమైన రుక్మిణీదేవి!"

"ఎప్పుడో ఎన్నేళ్లకిందటో తాతయ్యచెప్పిన ఆ జ్ఞానబోధ ఇన్నాళ్లపాటు, ఒక్కముక్క పొల్లుపోకుండా ఎలా గుర్తుంచుకున్నావ్ నానమ్మా!"

"నువ్విప్పుడు తెలిసీతెలీకుండానే వాడేవు, జ్ఞానబోధ అనేమాట. నిజంగా జరిగింది అదే. ఆయనలా చెప్పడం నన్ను బాగా ఆలోచించేలా చేసింది. రుక్మిణి సుఖానికి అక్కడ అడ్డుపడింది వాళ్లఅన్న. ఇక్కడ నన్నిలా అడ్డు పెడుతున్నది మా నాన్న 'వాళ్లు ఎవరైనాగాని, తప్పు పనిని ఎదిరిస్తే తప్పేముంది!' అనిపించింది.

మీ వాళ్లు ఎల్లుండిదాకా రారన్నావు. నీమటుకు నువ్వు స్వతంత్రించి నిర్ణయించుకునే వయసుంది నీకు. ఈ రాత్రీ రేపూ బాగా ఆలోచించుకో.

నీకిది కరెక్టని తోస్తేనే రేపు సాయంకాలం ఇదే గుడికిరా. నీ మెళ్లో మూడుముళ్లూ వేసేస్తాను. ఎనిమిదింటిదాకా నీకోసం చూస్తాను. వచ్చేముందు నీ నిర్ణయం మీ వాళ్లకి స్పష్టంగారాసి ఆ కాగితం మీ మేనత్త ద్వారా మీవాళ్లకి అందచేసే ఏర్పాటుచేసి మరీ రా' అని చెప్పి మరీ వెళ్లిపోయారు మీ తాతయ్య"

"అయితే నీకు ధైర్యంవచ్చి ఎనిమిదింటికల్లా అక్కడ చేరుకున్నావన్నమాట!" అడిగింది మనుమరాలు.

"అంతవరకు ఆగలేకపోయాను. ఆరుకాకుండా అక్కడ ప్రత్యక్షమై ఆయన ఒళ్లో వాలిపోయాను!

ఏం చెప్పమంటావే బంగారం, ఎన్ని జన్మలు చెప్పుకున్నా తరగనివి ఆయనతో గడిపిన

క్షణాలు!

నేనేదో సాహసం చేశాననుకుంటే అది వెర్రిమాట. ఆ రోజుల్లోనే లక్షకట్నంతోపాటు పెద్ద ఉద్యోగం చేస్తున్న మేనమామ కూతురు ఆయనకి ఉండనే ఉంది.

అదిగాక మావాళ్లనిమించిన శాఖపట్టింపులు వాళ్ల వాళ్ళవి. వాళ్లనాన్నగారిదంతా స్వార్జితం. నన్నుచేసుకుంటే దమ్మిడీదక్కదని ఇంట్లోంచి తగిలేసినా నన్నేచేసుకున్నారు! ఆయన్ని చేరేదాకా నాది ఆరో క్లాసు చదువే! మెట్రిక్ కట్టించారు. బియ్యే అంటే ఆ రోజుల్లో ఆడాళ్లకి అది బాగా ఎక్కువే. అదీ అయిందనిపించారు.

ఇలా ఒకటా రెండా ఆయనదగ్గిరుండి ఎక్కించిన మెట్లెన్నని! అంతకుముందు నాకు ఉండేది ఒంపు సొంపులశరీరం మాత్రమే! ఆ తర్వాత ఆయన సాహచర్యంలో గ్రహించింది మంచీచెడూ తెలుసుకునే మనసు ఉండాలని! తనకుతానై నిలబడ్డానికీ, నన్ను పెళ్లాడినందుకు ఏర్పడినవ్యతిరేకతని అధిగమించడానికీ ఎన్నో పాట్లుపడి అనుకున్నవన్నీ సాధించగలిగారో!"

"నీకేదో చెబుదామనుకుని నీముందే శ్రోతనై కూచున్నాను. అందర్లాగా కాక, ఎప్పుడో కన్నుమూసిన ఆయన పుట్టినరోజులే నువ్వెందుకుచేసుకుంటావో ఇన్నాళ్లకి అర్థమైంది నానమ్మా! తాతయ్యలాంటివాళ్లు చిరంజీవులు!" అంది మనుమరాలు.

"సరే! నా కథ అయిందిగా, ఇక మీ పెళ్ళెప్పుడనుకున్నారో చెప్పు!" అడిగింది ముసలామె.

"ఇప్పుడేనా! ఇంకా ఆరునెలలు పైగా ఆగవలసి ఉంటుందేమో నానమ్మా!" అంది మనుమరాలు.

"మీరిద్దరూ పాతికేళ్లపైచిలుకు రాచిలకలు, మీరేం చేసినా ఎప్పుడనుకున్నా అడ్డుపడే పెద్దలెవరూ లేరు కదా, మరెందుకంత ఆలస్యం?"

"పెళ్లంటే మాటలా నానమ్మా! ఆయన తరపున ఆడపడుచు, పెద్దమ్మకూతురు ఒక్కర్తంటే ఒక్కర్తే ఉంది. ఆవిడ భర్తతో సిడ్నీలో ఉంటోంది. ఇంకో ఆర్నెల్లకి గాని ఆవిడ ఇండియా రావడం కుదరదు. ఆవిడ పెళ్లికి రాకపోతే ఏంబాగుంటుంది. చెప్పు!

ఇక అమ్మా నాన్నా అన్నావా, ఓ పట్టాన ఇద్దరికీ లీవ్ గ్రాంట్కాదు. నీ కొడుకూ కోడలూ లేకుండా నీ మనవరాలి పెళ్ళిలా జరుగుతుంది చెప్పు. ఇంకా ఎన్ని చూసుకోవాలి. పట్టుచీరెలు, బంగారునగలు!"

"అవును పాపం, ఎన్ని కష్టాలు, ఎన్నెన్నికష్టాలు!"

"నేనెంతో సంబరంతో చెప్తూంటే నువ్విలా వ్యంగ్యంగా మాటాడితే ఎలా? నీ మనసులో ఉన్నదేదో డైరెక్ట్గా చెప్పు నానమ్మా, నేనేమీ అనుకోనుగా!"

"ఆ మాత్రం భరోసా ఇచ్చావు గనక నా అభిప్రాయం చెబుతున్నాను. విను.... ఎవరూ ఏరికోరి కష్టాలు కాంక్షించరు గాని అలాంటివి ఉన్నపుడే వాటిని అధిగమించినప్పుడే, జీవితంలో రుచి

తెలుస్తుందేమో....

ఆలూ మగలు అవకముందే స్పర్శతో పరామర్శతో పరస్పరం స్పందించగల అవకాశాలు ఈ రోజుల్లో ఆడామగాకి చాలానే ఉన్నాయి. ఎంతెంతో ముందడుగు వేస్తుంటే అదేమో అనుకున్నాను.

అన్ని భాషల చిత్రాల్లోనూ అర్ధనగ్నదృశ్యాలు తిలకించి పులకించేవరకేనా వారి శృంగార ప్రగతి! ఆకాశంలో ఏకమై రైల్వే కంపార్ట్‌మెంట్‌లో పురుళ్లుపోసుకుంటూంటే 'ఏమి ఈ స్పీడు!" అంటూ ముక్కుమీద వేలేసుకుంటున్నారు. తర్వాత నీళ్లాడడానికే అనుకుంటా, నీటిలోనే పెళ్లిచేసుకుందిట ఓ నారీమణి!"

కంప్యూటర్‌లో ఐ లవ్ యు అనే అల్లరి చిల్లరి వైరస్ చేరి కొన్నికోట్లు తగలేయించిందని విని 'ఏమిముందడుగు!' అని తెల్లబోతున్నారు! పెళ్లిముందే సంసారం చెయ్యాలనే దుర్భోధమాత్రం కాదిది.

కాని, అవకాశంలభించినా కాబోయే వధూవరులు మాట్లాడుకోవలసింది ముహూర్తాలూ, బట్టలూ, బ్యాండు మేళాలూ ఇంతవరకేనా? కనీసం సెక్సు విషయమైనా ఓ అవగాహనకి ముందుగానే రావొద్దా? జీవితమంతా శృంగారం ప్రసరించాలంటే ఇరుపక్షాలా కొంత ఎడ్వంచర్ ఉండొద్దా! ఏమంటావే నా బంగారం!"

★